క్లుప్తంగా

'అమ్మ ఆదర్శ పాఠశాల'పై అలసత్వం వద్దు


పనులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

తిమ్మాపూర్: అమ్మ ఆదర్శ పాఠశాల పనులపై అలసత్వం వద్దని అదనపు కలెక్టర్ అజయ్ యాదవ్ సూచించారు. జోగయ్య పల్లి ప్రాథమిక పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాలలో చేపడుతున్న పనులను మంగళవారం పరిశీలించారు. విద్యుత్ పనులు, ఇంకా చేయబోయే పనులను గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నాణ్యతతో పనులు చేయాలని సూచించారు. వేసవి సెలవులు పూర్తయ్యే లోగా పనులు చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీవో విజయ కుమార్, ఎంఈవో శ్రీనివాస్ రెడ్డి, ఏఈ సురేందర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి కె. మహేందర్ రావు, ఆర్ఐ అనిత, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ కోమలత తదితరులు ఉన్నారు.

భూమయ్య సేవలు మరువలేనివి

చొప్పదండి: మండల విద్యాధికారిగా బత్తుల భూమయ్య సేవలు మరువలేనివని, ఆయన అకాల మృతి దిగ్భ్రాంతికి లోను చేసిందని మాజీ మంత్రి సుద్దాల దేవయ్య నివాళి అర్పించారు. మంగళవారం భూమయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎంఈవో చిత్రపటం ముందు మౌనం పాటించారు. ఆయన వెంట దొంత రాజయ్య, కదారి గంగరాజు, అనంతయ్య, కళ్ళెం నవీన్‌కుమార్ తదితరులున్నారు.

బీఆర్‌టీయూ, ఆటో యూనియన్ ప్రచారం


ప్రచారం చేస్తున్న నాయకులు

కరీంనగర్: బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌కు మద్దతుగా భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్(బీఆర్‌టీయూ), జిల్లా ఆటో యూనియన్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని పలు ప్రాంతాలలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఆటో డ్రైవర్ల పొట్ట కొట్టిందని, బీజేపీ ప్రభుత్వం మోటార్ వెహికల్ చట్టాలను మారుస్తూ డ్రైవర్ల జీవనోపాధి కోల్పోయేలా చేసిందని ఆరోపించారు. ఎంపీ ఎన్నికల్లో ఆ రెండు పార్టీలకు గుణపాఠం చెప్పాలని కోరారు. బీఆర్ఎస్‌కు ఓటు వేసి, ఆటోడ్రైవర్లు తమ ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు రాజేందర్, నరసింహనాయక్, సత్యం, సంపత్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆట వస్తువుల పంపిణీ


సామగ్రి పంపిణీ చేస్తున్న స్వప్న

సప్తగిరికాలనీ: కరీంనగర్ మేము సైతం యువసేన ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నగరంలో కూలీ పని చేసుకునే కార్మికుల చిన్నారులకు ఆట వస్తువులు పంపిణీ చేశారు. సంస్థ వ్యవస్థాపకురాలు చకిలం స్వప్న, నిర్వాహకులు చకిలం శ్రీనివాస్, రూప పాల్గొన్నారు.

'ఓటమి ఖరారవడం వల్లే రాహుల్ గాంధీ పర్యటన రద్దు'

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ పార్లమెంటరీ నియోజకవర్గంలో కాంగ్రెస్ ఓటమి ఖరారవడం వల్లే రాహుల్ గాంధీ పర్యటన రద్దు చేసుకున్నారని బీజేపీ రాష్ట్ర నాయకుడు మురళీకృష్ణ ఆరోపించారు. ఎన్నికల అనంతరం అచూకీ తెలియని నేతగా కాంగ్రెస్ అభ్యర్థి రాజేందర్ రావు నిలుస్తారని ఎద్దేవా చేశారు. ప్రజాదరణ లేక కేవలం ధన ప్రవాహంతో మంత్రి పొన్నం ప్రభాకర్ ఎన్నికల ప్రచారం కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. సంతలో సరుకుల్లా కార్పొరేటర్లను, ప్రజాప్రతినిధులను కొనుగోలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రధాని మోదీ నాయకత్వంపై ప్రజలకు సంపూర్ణ విశ్వాసం ఉందని, అది తమకు ఎన్నికల ప్రచారంలో స్పష్టంగా కనిపిస్తోందని తెలిపారు. బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ భారీ మెజారిటీతో విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు.

ఈదురుగాలులకు విద్యుత్ ఫీడర్స్ బ్రేక్ డౌన్


సబ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు

జమ్మికుంట: హుజూరాబాద్ డివిజన్ పరిధిలో ఈదురుగాలులకు ఐదు 33/కేవీ ఫీడర్స్ బ్రేక్ డౌన్ కాగా.. యుద్ధప్రాతిపదికన విద్యుత్ అధికారులు, సిబ్బంది మరమ్మతులు చేశారు. విద్యుత్ సీజీఎం చౌహన్, డీఈఈ లక్ష్మారెడ్డి డివిజన్ పరిధిలో బ్రేక్ డౌన్ ప్రాంతాలను మంగళవారం సాయంత్రం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డివిజన్ పరిధిలో ఈదురుగాలులకు 20 విద్యుత్ స్తంభాలు పడిపోయాయని, సుమారు రూ.2.50 లక్షల నష్టం వాటిల్లిందని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఈ రాజేందర్, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

నిన్న బీజేపీ.. నేడు బీఆర్ఎస్‌లోకి..



సోమవారం బండి ఆధ్వర్యంలో బీజేపీలోకి.., మంగళవారం కౌశిక్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లోకి..

జమ్మికుంట: ఎన్నికల వేళ.. జంపింగ్ జపాంగ్‌లు అందరిని ఆకట్టుకుంటున్నాయి. నిన్న బీజేపీ, నేడు బీఆర్ఎస్ పార్టీ కండువాలు కప్పుకుంటుండంతో నేతల తీరు పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. మోత్కులగూడెంకు చెందిన మాజీ ఎంపీపీ రామస్వామి గతంలో బీఆర్ఎస్ పార్టీలో ఉన్నారు. కాగా సోమవారం పట్టణంలో యువ సమ్మేళనం సందర్భంగా ఎంపీ బండి సంజయ్‌కుమార్ సమక్షంలో బీజేపీలో చేరారు. మంగళవారం తిరిగి బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. రోజు వ్యవధిలో రెండు పార్టీలు మారడం పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు


గణేశ్‌ను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న పొన్నం

సైదాపూర్: తాజా మాజీ సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు కొండ గణేశ్ మంగళవారం హుస్నాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వెన్కెపల్లి తాజా మాజీ సర్పంచ్‌గా, మండల సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడిగా, బీఆర్ఎస్ పార్టీలో కీలక వ్యక్తిగా కొనసాగిన గణేశ్ తోపాటు రాయికల్‌తండా తాజా మాజీ సర్పంచ్ బర్మావత్ అక్షయశ్రీనివాస్ వారి అనుచరులతో కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు గెలుపు కోసం కృషి చేస్తామని తెలిపారు. నాయకులున్నారు.

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని ధర్మారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పాత సత్యం, మాజీ వార్డు సభ్యుడు పాత సమ్మయ్య, భాస్కర్, రాజశేఖర్, విజయ్ కాంగ్రెస్ హుజురాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. సీనియర్ నాయకులు మహమ్మద్ సలీం, మేడిపల్లి మహేందర్, పోతుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు నాయీబ్రాహ్మణ ఐక్య వేదిక మద్దతు


ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్‌కు మద్దతు పలుకుతున్న ఐక్య వేదిక నాయకులు

కరీంనగర్: తెలంగాణ నాయీబ్రాహ్మణ ఐక్యవేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుంజపడుగు హరిప్రసాద్, నాయకులు కరీంనగర్‌లోని హౌసింగ్‌బోర్డు కాలనీలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వేదిక తరఫున మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు. అనంతరం వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. కరీంనగర్‌లో జరిగిన అభివృద్ధి అంతా తాను ఎంపీగా ఉన్నప్పుడు చేసిందేనన్నారు. గత ఐదేళ్లుగా ఎంపీ బండి సంజయ్ కేంద్రం నుంచి ఒక్క రూపాయి కూడా తీసుకురాలేదని ఆరోపించారు. మతం పేరుతో యువకులను అయోమయానికి గురిచేశారని పేర్కొన్నారు. ఈసారి ఆయన మాటలు నమ్మే పరిస్థితిలో నియోజకవర్గ ప్రజలు లేరన్నారు. అలాగే, నాయీబ్రాహ్మణులు ఉద్యమ సమయం నుంచి బీఆర్ఎస్ పార్టీకి మద్దతుగా ఉన్నారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అవుదుర్తి విజయ్‌కుమార్, గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ మల్లెంకి శ్రీనివాస్, నగర కోశాధికారి శ్రీరాముల రమేశ్, నాయకులు నాగవెల్లి లక్ష్మణ్, సముద్రాల మధు, కల్యాణం శ్రీనివాస్, గర్శకుర్తి విద్యాసాగర్, కొత్వాల అశోక్, గుంజపడుగు పవన్, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

మా నాన్నను ఎంపీగా గెలిపించండి

- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి 'వెలిచాల' కూతుళ్లు


గోపాల్‌పూర్‌లో ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న రచన, రితిక

కరీంనగర్‌రూరల్: మా నాన్నను ఎంపీగా గెలిపించాలని కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు కూతుళ్లు రచన, రితిక కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం కరీంనగర్ మండలంలోని గోపాల్‌పూర్, దుర్శేడ్, ఇరుకుల్ల గ్రామాల్లో ఉపాధిహామీ కూలీలను కలిసి, ఓటు అభ్యర్థించారు. ఎంపీగా గెలిపిస్తే రాజేందర్‌రావు చేయబోయే అభివృద్ధి పనులపై కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం దుర్శేడ్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు, హమాలీలను కలిసి, మాట్లాడారు. కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు కె.రాంరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్.తిరుపతి, నాయకులు బి.హరీశ్ గౌడ్, తిరుపతి, కె.రాకేశ్, జె.మారుతీరావు, బి.శేఖర్, మురళి, లచ్చయ్య, రమేశ్, బాబుగౌడ్, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో సైకాలజిస్టుల పాత్ర గొప్పది

- తానా వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ శ్రీనివాస్


శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న సైకాలజిస్టులు

కరీంనగర్‌టౌన్: సమాజంలో యువతను సన్మార్గంలో నడిపించడంలో సైకాలజిస్టుల పాత్ర గొప్పదని తానా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కరీంనగర్‌లోని వాసుదేవ ఆస్పత్రిలో తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒత్తిడికి లోనైన వారిలో ఆత్మస్థైర్యం నింపుతూ, ఆత్మహత్యలను నివారించి, వారిలో ధైర్యాన్ని పెంపొందించడం వెలకట్టలేనిదని పేర్కొన్నారు. తెలంగాణ సైకియాట్రిస్టు అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వర్ గాలిపల్లి మాట్లాడుతూ.. తాము విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నెల 16 నుంచి ప్రతీ ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలో వన్ లైఫ్ భరోసా ప్రోగ్రాం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీపీఏ ప్రతినిధులు అనురాధ, మెతుకు సత్యం, శ్రీనివాస్, భూమేశ్, వాణి, లలిత, అనిత, ఐలయ్య, సతీశ్, డాక్టర్ అహ్మద్ పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలి


ధాన్యాన్ని పరిశీలిస్తున్న సుంకె రవిశంకర్

గంగాధర: అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సాయంత్రం మండలంలో వర్షం కురవగా.. బూర్గుపల్లి కొనుగోలు కేంద్రంలో తడిసిన వరి ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. గత ప్రభుత్వ పాలనలో వర్షాలకు తడిసిన, రంగు మారిన ధాన్యం సైతం కొనుగోలు చేశారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం రూ.500 బోనస్ ఇస్తామని ఇవ్వకుండా రైతులను మోసం చేస్తోందని అన్నారు. ఆయన వెంట నాయకులు శంకర్‌గౌడ్, బాలగౌడ్, గంగయ్య, అజయ్ తదితరులున్నారు.

ధాన్యం కొనుగోళ్లలో విఫలం

చొప్పదండి: అకాల వర్షాలకు చొప్పదండి వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతుల ధాన్యం తడిసిపోయిందని, ప్రభుత్వం బేషరతుగా ఎటువంటి షరతులు లేకుండా రైతుల ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేయాలని బీజేపీ జిల్లా కార్యదర్శి చేపూరి సత్యనారాయణ, పట్టణ శాఖ అధ్యక్షుడు బత్తిని ప్రశాంత్ కోరారు. మంగళవారం చొప్పదండి వ్యవసాయ మార్కెట్ యార్డును సందర్శించారు. వాతావరణ శాఖ హెచ్చరికలున్నా.. ధాన్యం కొనుగోళ్లను సకాలంలో పూర్తి చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. ఎన్నికల మీద ఉన్న శ్రద్ధ ధాన్యం కొనుగోలు మీద పెట్టడం లేదని విమర్శించారు. వారి వెంట రాజన్నల రాజు, శ్రవణ్ కుమార్, కుమార్, అనూష్, మధు, కళ్యాణ్, మహేశ్ తదితరులున్నారు.

రైతులు అధైర్యపడొద్దు

చొప్పదండి: మండలంలో కురిసిన వర్షం ధాటికి రైతుల ధాన్యం తడిసిందని, తడిసిన ధాన్యంపై రైతులు అధైర్యపడొద్దని పీఏసీఎస్ చైర్మన్ వెల్మ మల్లారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడామని, అధికారులు భరోసా ఇచ్చారని తెలిపారు. భారీ వర్షం కురవడంతో పలుచోట్ల కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిందని తెలిపారు. ఎటువంటి ఆంక్షలు లేకుండా ధాన్యం కొనుగోలుపై దృష్టి సారించినట్లు చెప్పారు.

బండి సంజయ్‌ని గెలిపించాలి


ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

రామడుగు: కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్‌కుమార్‌ను గెలిపించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేకల ప్రభాకర్‌యాదవ్ కోరారు. దేశరాజ్‌పల్లిలో మంగళవారం పార్టీ నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. జిల్లా కార్యదర్శి ఉప్పు రాంకిషన్, లత, జాతరగొండ ఐలయ్య, వెలుముల రమేశ్, మీసాల సునీల్, ఉప్పు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థికి ఓటు వేయాలి


ప్రచారం చేస్తున్న నాయకులు

కరీంనగర్: బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌కు మద్దతుగా ఆ పార్టీ సీనియర్ నాయకుడు కెంసారం తిరుపతి ఆధ్వర్యంలో మంగళవారం నగరంలో కరపత్రాలు పంచుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినోద్‌కుమార్ కరీంనగర్‌కు స్మార్ట్‌సిటీ తీసుకువచ్చారని, జాతీయ రోడ్లు, రైల్వేలైన్లు ఏర్పాటు చేశారని తెలిపారు. మరింత అభివృద్ధి జరగాలంటే ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ఆయనను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కన్నం శ్రీనివాస్, సత్తయ్య, అశోక్, చంద్రం, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 5కె రన్



రన్‌లో పాల్గొన్న యువత

కరీంనగర్ స్పోర్ట్స్: ఓటరు అవగాహన కార్యక్రమంలో భాగంగా మంగళవారం నగరంలో నిర్వహించిన 5కె రన్ ఉత్సాహంగా సాగింది. కార్యక్రమాన్ని ఉదయం కలెక్టరేట్ ఎదుట స్వీప్ నోడల్ అధికారి ఎస్.రామాచారి జెండా ఊపి, ప్రారంభించారు. మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లందరూ విధిగా తమ ఓటుహక్కు వినియోగించుకోవాలని కోరారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయాలన్నారు. కాగా, రన్ కలెక్టర్ కార్యాలయం నుంచి కమాన్, కోతిరాంపూర్ మీదుగా తిరిగి కలెక్టరేట్‌కు చేరుకుంది. కార్యక్రమంలో మెప్మా పీడీ రవీందర్, యువత తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ రాజ్యం కాంగ్రెస్‌తో సాధ్యం


కందుగులలో ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న వొడితల ప్రణవ్

హుజూరాబాద్‌రూరల్: ఇందిరమ్మ రాజ్యం కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాశ్ అన్నారు.పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం మాట్లాడారు. దళిత బహుజనులు 70 శాతం కాంగ్రెస్ వైపే ఉన్నారన్నారు.అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పరిపాలనను కోరుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్నారన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని సబ్బండ వర్గాల ప్రజలు,వివిధ పార్టీలు ప్రజలు, సంఘాల నాయకులు కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొని వచ్చి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే తప్ప మనకు ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీ ప్రజలకు మనుగడ ఉండదన్నారు. బీజేపీ ప్రభుత్వం ఎల్ఐసీ, బీఎస్ఎన్ఎల్, రైల్వే ప్రైవేటీకరణ చేస్తూ పారిశ్రామికవేత్తలకు కొమ్ము కాస్తుందన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి రాజేందర్ రావును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలోనాయకులు తునికి సమ్మయ్య ,పొన్నాల వినోద్‌కుమార్,గంగారపు రవి,గిరిమళ్ల సాయి,కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్‌రూరల్: ఉపాధిహామీ కూలీల పనులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని, కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కూలీ ధరలు పెంచేలా చర్యలు తీసుకుంటుందని నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ అన్నారు. మంగళవారం చెల్పూర్, కందుగుల గ్రామాల్లో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు ఓటేసి అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. నాయకులు నేరేళ్ల మహేందర్‌గౌడ్, పాలంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కోల్లూరి కిరణ్ తదితరులున్నారు.

వీణవంక: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని, ప్రభుత్వంపై ప్రతిపక్ష పార్టీల ఆరోపణలు మానుకోవాలని మండల సీనియర్ నాయకుడు సాహెబ్ అన్నారు. మండల కేంద్రంలో ఉపాధిహామీ కూలీల వద్దకు వెళ్లి ఆరు గ్యారంటీలపై వివరించారు. మదాసు సునీల్, ఓరెం శ్రీనివాస్, భాస్కర్, అఖిల్, రమేశ్, రాజేశ్, వెంకటేశ్, రజాక్ ఉన్నారు.

ఇల్లందకుంట: శ్రీరాములపల్లి గ్రామంలో మండల అధ్యక్షుడు రామారావు ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. నాయకులు రవికుమార్, లక్ష్మయ్య, రాకేశ్, రాజు, కళ్యాణ్, నాగరాజు, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు ఓటేస్తే అన్ని వర్గాలకు న్యాయం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి


రేకొండలో ప్రచారం చేస్తున్న ఎంపీపీ వినీతశ్రీనివాస్‌రెడ్డి

హుజూరాబాద్‌రూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటేస్తే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని సిర్సపల్లి, వెంకట్రావ్‌పల్లి,చెల్పూర్ గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలు, రైతులతో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు దండుకునేందుకు ఆగస్టు 15 లోపు ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఎన్నో సంక్షేమ పథకాలను తీసుకొచ్చి దేశానికి ఆదర్శంగా నిలిచేలా చేసిందన్నారు.తెలంగాణ ప్రజల ఆస్తిత్వాన్ని కాపాడేది బీఆర్ఎస్ పార్టీ మాత్రమేనన్నారు. జిల్లా ప్రజల సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకువెళ్లలా పార్లమెంట్లో వినోదకుమార్ గట్టిగా మాట్లాడుతారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని గెలిపిస్తే తెలంగాణ ప్రజల తరఫున వినోద్ కుమార్ మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తాడన్నారు. కార్య క్రమంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, ఎంపీపీ రాణి సురేందర్‌రెడ్డితో పాటు తదితరులు ఉన్నారు.

చిగురుమామిడి: ఈనెల 13న జరిగే పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్‌ను గెలిపించాలని చిగురుమామిడి ఎంపీపీ కొత్త వినీతశ్రీనివాస్‌రెడ్డి కోరారు. మంగళవారం రేకొండ, చిగురుమామిడి గ్రామాల్లో ఈజీఎస్ పని ప్రదేశంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య, ఎంపీటీసీ కొత్తూరి సంధ్య, మాజీ ఎంపీపీ ఆకవరం భవాని, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

హుజూరాబాద్‌రూరల్: కాట్రపల్లి గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. తొగరు భిక్షపతి, కానగోని కిరణ్, తొగరు శివకృష్ణ, మైన సుధాకర్, మాడుగుల వెంకటస్వామి, తొగరు శ్రీనివాస్, సబ్బని పరంధాములు తదితరులున్నారు.

రామడుగు: వినోద్‌కుమార్‌ను గెలిపించాలని వెలిచాల మాజీ సర్పంచ్ వీర్ల సరోజనప్రభాకర్ రావు కోరారు. గ్రామంలోని ఉపాధిహామీ కూలీలను కలిసి ప్రచారం నిర్వహించారు. మాజీ సర్పంచ్ వీర్ల రవీందర్‌రావు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

'మధ్యాహ్న' కార్మికుల సమస్యలు ప్రస్తావిస్తా

- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్


వినోద్‌కుమార్‌కు వినతి పత్రం ఇస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

కరీంనగర్: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావిస్తానని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. మంగళవారం కరీంనగర్‌లోని బీఆర్ఎస్ పార్లమెంట్ కార్యాలయంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘాల ప్రతినిధులు ఆయనను కలిసి, వారి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో కార్మికులు మధ్యాహ్న భోజనం కట్టెల పొయ్యిపై చేస్తూ ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. తనను గెలిపిస్తే కేంద్ర ప్రభుత్వ రంగ గ్యాస్ కంపెనీల ద్వారా సిలిండర్లు ఇచ్చేలా కొట్లాడుతానని హామీ ఇచ్చారు. 2014 నుంచి 2019 వరకు తాను ఎంపీగా ఉన్నప్పుడు కూడా మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్తే కొన్ని పరిష్కారానికి నోచుకున్నాయని పేర్కొన్నారు.

ఆశీర్వదించి, పార్లమెంట్‌కు పంపించండి

పార్లమెంట్ ఎన్నికల్లో తనను ఆశీర్వదించి, పార్లమెంట్‌కు పంపిస్తే మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. మంగళవారం నగరంలోని 7వ డివిజన్ పరిధి హౌసింగ్‌బోర్డు కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పదేళ్లల్లో చేసిన అభివృద్ధిని గుర్తించి, ఎంపీ ఎన్నికల్లో పార్టీని గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నగర శాఖ చల్ల హరిశంకర్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, నారదాసు వసంతరావు, గూడెల్లి రాజ్‌కుమార్, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవో కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

కరీంనగర్: ఎన్నికల విధుల్లో పాల్గొంటూ ఈ నెల 4న వడదెబ్బతో మృతిచెందిన వెల్గటూరు, ధర్మపురి, బుగ్గారం, ఎండపల్లి మండలాల ఎంఈవో బత్తుల భూమయ్య కుటుంబానికి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎం.ఎ.ఖాద్రీ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. భూమయ్య గత నెల 18 నుంచి పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఎన్నికల విధుల్లో స్టాటిస్టికల్ సర్వేలెన్స్ టీం సభ్యుడిగా పని చేస్తూ వడదెబ్బకు గురయ్యారని పేర్కొన్నారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

ఎన్నికల సిబ్బందికి డ్యూటీ సర్టిఫికెట్లు ఇవ్వండి



కలెక్టర్ పమేలా సత్పతికి వినతి పత్రం ఇస్తున్న పీఆర్టీయూ నాయకులు

సప్తగిరికాలనీ: ఈ నెల 13న పార్లమెంట్ ఎన్నికల్లో పాల్గొనే సిబ్బందికి ఏఈఆర్వో ద్వారా డ్యూటీ సర్టిఫికెట్లు ఇవ్వాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తిరుపతి రెడ్డి, జైపాల్ రెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ పమేలా సత్పతికి వినితిపత్రం అందించారు. ఎండలు మండుతున్న దృష్ట్యా పోలింగ్ బూత్‌లలో కూలర్లు, చల్లని నీటిని ఏర్పాటు చేయాలని కోరారు.